సాక్షి తిరుపతి

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



యువత శాస్త్రవేత్తలు కావాలి

నేటి యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలని చెన్నై నాయిట్ కేంద్రం డైరెక్టర్ బాలాజీ రామకృష్ణ పిలుపునిచ్చారు. - IIలో



అనంత తేజోమయుడు

తుమ్మలగుంటలోని కల్యాణవేంకటేశ్వరస్వామి గురువారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగారు. - IIలో



సర్పంచ్‌పై మేట్ దాడి

చింతగుంట సర్పంచ్ చెంచు ప్రసన్న కుమార్‌పై ఉపాధి హామీ మేట్ కారంపూడి కోటేశ్వరరావు దాడి చేశారు. - IIలో

న్యూస్‌రీల్

ఏపీ రీసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీయూ నిర్వహించిన ఏపీఆర్ సెట్ 2023–24 లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసెట్ చైర్మన్ ఆచార్య కె రామ్మోహన్‌రావు సూచనల మేరకు రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో పీహెచ్‌డీ (పార్ట్ టైం, ఫుల్ టైం) 2,566 సీట్లకు వెబ్ వెరిఫికేషన్ జరిపి సీట్ల కేటాయించామన్నారు. తొలిదశలో ఫుల్ టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మంది, మొత్తం 2,008 మందికి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టు చేసి, సంబంధిత విశ్వవిద్యాలయాల్లో నేరుగా ఈనెల 14 నుంచి 19వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై అడ్మిషన్లు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎరువుల డీలర్లతో అధికారులు సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: నకిలీ విత్తన విక్రయాలపై దుకాణాల డీలర్లతో వ్యవసాయాధికారులు సమీక్షించారు. మొలకెత్తని నకిలీ విత్తనాలు విక్రయించడం, ఎమ్మార్పీకి కాకుండా అధనపు ధరలకు ఎరువులను రైతులకు అమ్మడం, అధికారుల పర్యవేక్షణ లేకుండా కమీషన్లకు అలవాటు పడి అధికారులు కార్యాలయానికి పరిమితం కావడం తదితర అంశాలను క్రోడీకరిస్తూ రెండు రోజులుగా సాక్షి దినపత్రికలో వస్తున్న కథనాలపై వ్యవసాయశాఖ జిల్లా అధికారులు స్పందించారు. గురువారం హుటాహుటిన తిరుపతిలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు విక్రయించకూడదని, ఎమ్మార్పీకే ఎరువులు అమ్మకాలు చేయాలని, వ్యాపారులు సిండికేట్ అయి...ఎరువుల కొరత సృష్టిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని సూచనలు చేసి పంపించారు. కలెక్టరేట్ ఏడీ ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న మలయప్పస్వామి(ఇన్‌సెట్‌లో) చంద్రప్రభవాహనంపై శ్రీవారు







సూర్య, చంద్ర ప్రభ..
శేషాద్రివాసుడి శోభ

సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడైన ఆధిత్యుడిపై అభిషేకప్రియుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు ఆయురారోగ్యప్రాప్తిని ప్రసాదించాడు. నక్షత్రాలకు అధిపతి, ఆహ్లాదకారి అయిన చంద్రుడిపై చల్లనయ్య శ్వేత వర్ణ కలువల అలంకరణలో కొలువుదీరి, భక్తకోటికి దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజైన గురువారం తిరువేంకటనాథుడికి సూర్య, చంద్రప్రభ వాహనసేవలు వైభవంగా సాగాయి.

బ్రహ్మోత్సవాల్లో బ్రహ్మాండనాయకుడు

- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై శ్రీవారు
- తిరుమంజనంలో సేద తీరిన దేవదేవుడు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై మలయప్ప స్వామివారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఉదయం సూర్యకాంతుల నడుమ భాస్కరునిపై వేంకటపతి బద్రి నారాయణ అలంకారంలో స్వర్ణ కాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. సూర్యప్రభ వాహనంలో చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ భక్తులు వర్షంలోనే నిల్చుని మలయప్పస్వామిని దర్శించుకున్నారు. వర్షానికి స్వామివారిని ఘటాటోపం కింద తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో బ్రహ్మోత్సవాల్లో మూడో స్నపన తిరుమంజనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు సేద తీరారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామి ఊయల ఊగుతూ దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనసేవలో మంగళధ్వనుల, పండితుల వేద ఘోషలో చల్లనయ్య శ్వేత వర్ణ కలువల అలంకరణలో భక్తలోకానికి తన దివ్యమంగళ రూపంలో దర్శనమిచ్చారు. ఇక వాహన సేవల్లో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నాదనీరాజనం, ఆస్థాన మండపంలో కళాకారులు భక్తి, సంగీత కార్యక్రమాలు భక్తులకు వీనుల విందు చేశాయి.







సూర్య, చంద్రప్రభ వాహనసేవల సందర్భంగా తిరుమాడ వీధుల్లో కళాప్రదర్శనలు

శ్రీవారి రథోత్సవానికి సర్వం సిద్ధం

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మాడ వీధుల్లో స్వామివారు రథంపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. ఇప్పటికే టీటీడీ ఇంజినీర్లు రథచక్రాలు పరీక్షించి అన్నీ సవ్యంగా ఉన్నాయని తేల్చారు. అనంతరం రాత్రికి స్వామివారు అశ్వవాహనంపై విహరించనున్నారు. పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, టెంపుల్ డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

చక్రస్నానం నిర్వహణకు పుష్కరిణిలో ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు శనివారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. వైదికంగా నిర్వహించే ఈ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ పుష్కరిణిలో భారీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే కొత్త నీటిని నింపి, వందశాతం క్లోరినేషన్ చేశారు. ప్రత్యేకంగా ఇనుప చైన్ లింక్ కంచెలు నిర్మించారు. వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో సుదర్శన చక్రతాళ్వార్‌కు పుణ్యస్నానం చేసే ప్రాంతంలో ప్రత్యేక చక్రస్నానం చేసే ప్రాంతంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులను ఉదయం 4 గంటల నుంచి పుష్కరిణిలోకి అనుమతిస్తారు. భక్తులు రోజంతా పుణ్యస్నానాలు చేయవచ్చని ఆలయ అర్చకులు, అధికారులు తెలిపారు.

ఇసుక ఉచితం..
దోపిడీ నిజం

పేదలకు ఇసుక దొరకడం గగనం.. కారణం.. ఉమ్మడి జిల్లాలో అధిక శాతం పాయింట్లు బోసిపోవడం.. అయితే పచ్చనేతలకు మాత్రం లభ్యం .. ఇందుకు అనధికారిక రీచ్‌లే తెలుగుతమ్ముళ్లకు ఆధారం.. ఏదీ ఏమైనా ఇసుక ఉచితం.. దోపీడీ నిజం. ఇదీ జిల్లాలో సైఖతం స్థితి.

- రేణిగుంటకు చెందిన రహంతుల్లా రెండు నెలల క్రితం సొంతింటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఇంటి నిర్మాణానికి ఇసుక దొరక్క.. ఓ సారి పిచ్చాటూరు అదవికోయంబేదులో ఓ ట్రాక్టర్, పాడిపేట సమీపంలో టీడీపీ నేతల చుట్టూ పలుసార్లు ప్రదక్షిణలు చేసి అతి కష్టంపై మరో ట్రాక్టర్ ఇసుక తెచ్చుకున్నాడు. ఇంకా రహంతుల్లాకి పది ట్రిప్పుల ఇసుక అవసరం. ఇసుక కోసం ప్రభుత్వ రీచ్‌లు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఇసుక దొరకలేదు. చేసేది లేక ప్రస్తుతం నిర్మాణాన్ని అర్ధాంతరంగా ఆపివేశారు.

- శ్రీకాళహస్తి హౌసింగ్ బోర్డు కాలనీలో టీడీపీకి చెందిన నాయకులు అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. వీరు చుక్కలనిడిగల్లు సమీపంలోని స్వర్ణముఖి నుంచి రాత్రి సమయాల్లో జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంప్ చేసుకున్నారు. కూటమి నేతలు, అనుచరుల భవన నిర్మాణాలకు ఇసుక కొరత లేదు. వారికి మాత్రం కావాల్సినంత ఇసుక లభ్యమవుతోంది.



ఏర్పేడు మండలం పాతవీరంపురం వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాల కోసం ఏర్పాటు చేసుకున్న రోడ్డు

ఇసుక లేదు.. పక్క జిల్లాల్లో తెచ్చుకోండి

- నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలుకు వెళ్లండి
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల్లో ఇసుక లేదు.. రాదు
- ఇసుక కోసం అన్వేషిస్తున్నామంటున్న అధికారులు
- చేతులెత్తేసిన అధికార యంత్రాంగం.. ఆందోళనలో వినియోగదారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'ప్రభుత్వ రీచ్‌ల్లో ఇసుక లేదు.. పొరుగు జిల్లాలైన నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు వెళ్లి తెచ్చుకోండి. ఒకవేళ ఇసుక కావాలంటే.. ప్రభుత్వం రీచ్‌లు ఏర్పాటు చేసే వరకు ఆగితే దొరుకుతుంది. అప్పటి వరకు మేమేమీ చెయ్యలేం' అని భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి బాలాజీ నాయక్ తేల్చిచెప్పారు. ఇదిలా ఉంటే.. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఇసుక విషయమై సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. పెళ్లకూరు, కోట మండలాల పరిధిలో ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించినట్లు, ఆయా ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ నేతల అనధికారిక రీచ్‌ల్లో ఇసుక ఫుల్

ఎన్నికల ముందు ఇసుకను ఉచితంగా ఇస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక జేబులు నింపుకోవడానికి ఇసుకను అక్రమంగా తవ్వి తరలించి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల వద్ద గత 40 రోజులుగా ఇసుక కరువైంది. అయితే టీడీపీ నేతలకు మాత్రం కావాల్సినంత ఇసుక లభ్యమవుతోంది. స్వర్ణముఖి, కొండిన్య, కాళంగి, ఆరణియార్, నీవాలో ఇసుక ఉన్నా.. అధికారులు మాత్రం స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ చేయాలనే బాధ్యత మరిచారు. 162 కి.మీ విస్తరించి ఉన్న స్వర్ణముఖిలో అవసరమైనంత ఇసుక ఉన్నా.. అధికారులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై నదిలో లభ్యమయ్యే ఇసుకను రాత్రి వేళలో జేసీబీలతో తవ్వి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో చంద్రగిరి, పాడిపేట, గాజులమండ్యం, పాపానాయుడుపేట, పెనుమల్లం, గోవిందవరం, కొత్తవీరాపురం, ముసిలిపేడు, మోదుగులపాళెం, అబ్బాపట్లపల్లి, పుల్లారెడ్డి కండ్రిగ, అమ్మపాళెం, శ్రీకాళహస్తి, చెంబేడు, కలవకూరు, పెళ్లకూరు, నాయుడుపేట, భీమవరం, మర్లపల్లి, అన్నమేడు, చిట్టమూరు మండల పరిధిలోని గుణపాడు, కోట మండల పరిధిలోని గూడలి, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం కూడలి, గూడూరు మండలం కైవల్యానది పరివాహక ప్రాంతంలోని ఇందూరు, పంబలేరు, కాళంగి నదీ పరివాహక ప్రాంతంలో ఇల్లుపూరు, కరుణానది, అరుణానదీ పరీవాహక ప్రాంతం, నీవా నది పరీవాహక ప్రాంతమైన కొట్రకోన, జీడీ నెల్లూరు, వేల్కూరు, ముక్కల తూరు, రాసమరెడ్డిపల్లి, పాతపాలెం, కౌండిన్య నది పరీవాహక ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఇసుకను తవ్వి విక్రయించేందుకు ఒక్కో టీడీపీ నేత ఒక్కొక్కరికి బాధ్యతలు అప్పగించారు. ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 విక్రయిస్తుంటే.. ఇందులో నుంచి రూ.1,200 సంబంధిత అధికారులకు వాటా రూపంలో పంపుతున్నారు. మిగిలిన రూ.1,300 టీడీపీ నేతలు, కాంట్రాక్టర్ పంచుకుంటున్నారు. స్వర్ణముఖి నదిలో లభ్యమయ్యే ఇసుకకు తమిళనాడు, బెంగళూరులో మంచి డిమాండ్ ఉండడంతో అధికశాతం పక్కరాష్ట్రాలకు తరలించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్..

రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఎనిమిది ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. వెంకటగిరి మండలం మొగళ్లగుంట, సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మావిళ్లపాడు, సత్యవేడు నియోజక వర్గం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ, పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు, చిత్తూరు జిల్లాలో గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండల పరిధిలో దిగువమాసాపల్లి, పాలూరు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఒక్క చిత్తూరు రూరల్ మండల పరిధిలో ఒక స్టాక్ పాయింట్‌లో తప్ప మరెక్కడా ఇసుక లేదు. ఇసుక లేకపోవడంతో ఆన్‌లైన్ బుకింగ్ జరగడం లేదు. చిత్తూరులో ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా.. టీడీపీ నేతలే బినామీ పేర్లతో బుక్ చేసుకుని, అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



వెంకటగిరి మండలం మొగళ్లగుంట ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేని దృశ్యం

స్వర్ణముఖి నదిలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు



స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తోడుతున్న జేసీబీలు



పంట పొలాల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు



చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ తనిఖీలు



పుష్కరిణిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమల: శ్రీవారి పుష్కరిణిలో ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న చక్రస్నానం ఏర్పాట్లను టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులతో కలసి గురువారం తనిఖీ చేశారు. ప్రవేశ మార్గాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, శ్రీవారి సేవకులను సమన్వయం చేసుకుని చక్రస్నాన సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 79,753 మంది స్వామి వారిని దర్శించుకోగా 29,623 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

ఆదిత్యుడిపై..

అనంత తేజోమయుడు


సూర్యప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న


చంద్రప్రభ వాహనంపై స్వామివారు

- అలరించిన దేవతా మూర్తుల కళారూపాలు
- చిరు జల్లుల నడుమ సూర్య ప్రభ వాహన సేవ
- చంద్రునిపై ఆరోగ్య ప్రదాత చల్లని దీవెనలు
- వైభవంగా తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి రూరల్: తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన గురువారం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారు ఉదయం అనంత తేజోమయుడిగా సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం ఆరోగ్య ప్రదాతగా చల్లని దీవెనలు అందిస్తూ చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు.

వజ్ర కవచధారిగా...

సప్తమి – సూర్యప్రభ వాహనం హిందూ సంప్రదాయం ప్రకారం సప్తమి తిథి సూర్య భగవానుని ఆరాధనకు శ్రేష్టమైనది. అందులో భాగంగా గురువారం ఉదయం సూర్యోదయం వేళ ఆశ్వయుజ సప్తమి తిథి ఉన్నందున శ్రీనివాసునికి సూర్య ప్రభ వాహన సేవ జరుగుతుంది. శ్రీనివాసుడే సూర్యనారాయణుడు వజ్ర కవచం ధరించి ఉదయ భానుని కిరణాలు ప్రసరిస్తుండగా గ్రామంలో ఊరేగుతూ సూర్య మండలం మధ్యనున్న నారాయణమూర్తిని నేనే అని భక్తులకు ప్రభోదించడమే ఈ వాహనసేవ పరమార్థం.

చంద్రునిపై.. చల్లనయ్య..

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీనివాసుడు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ తన చల్లని దీవెనలను భక్తులకు అందించారు. వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మనశ్శాంతి రోగ నాశనం

హిందూ సంస్కృతి ప్రకారం చంద్రుడు మనఃకారకుడు. ఔషధాలను తేజోవంతం చేసే శక్తి కలవాడు. అందుకే చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుంది. సమస్త ఔషధీ తత్వంతో రోగ నాశనం జరుగుతుంది. అంతేకాదు చంద్రప్రభ వాహనంపై ఊరేగే స్వామి దర్శనంతో సకల పాపాలు తొలగి, సమస్త సంపదలు సమకూరుతాయని భక్తుల విశ్వాసం.

సర్పంచ్‌పై మేట్ దాడి

వెంకటగిరి రూరల్: సర్పంచ్‌పై ఉపాధి హామీ మేట్ దాడి చేశాడు. బాధితుడి కథనం మేరకు.. వెంకటగిరి రూరల్ మండలం చింతగుంట పంచాయతీలో ప్రస్తుతం ఉపాధి హామీ మేట్‌గా పనిచేస్తున్న కారంపూడి కోటేశ్వరరావు 2014లో టీడీపీ హయాంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. అప్పట్లో అతను నీరు–చెట్టు పథకంలో భాగంగా పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకుని అవినీతికి పాల్పడ్డాడు. ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో ఆయన అవినీతి బట్టబయలైంది. దీంతో సోషల్ ఆడిట్ నిర్వహించిన అప్పటి అధికారులు కోటేశ్వరరావును రెండుసార్లు సస్పెండ్ చేయడంతోపాటు అవినీతికి పాల్పడిన నగదును రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటికి ఆ పనులకు సంబంధించిన నిధులు విడుదల కాలేదు. ఈ క్రమంలో 2019లో చెంచుప్రసన్నకుమార్ సర్పంచ్ అయ్యారు. చెంచుప్రసన్న కుమార్ హయాంలో టీడీపీ ప్రభుత్వంలో పెట్టిన బిల్లులకు సంబంధించిన నగదు చింతగుంట పంచాయతీ నిధుల్లో జమ అయింది. ఆ నిధులు తనకు ఇవ్వాలని కోటేశ్వరరావు, చెంచుప్రసన్నను ఒత్తిడి చేశారు. అయితే సర్పంచ్ అందుకు అంగీకరించకుండా నిధులు విడుదల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం అధికారుల ఆదేశాల మేరకు నిధులు డ్రా చేస్తామని కోటేశ్వరరావుకు చెప్పారు. అయితే కోటేశ్వరరావు అప్పటి నుంచి చెంచుప్రసన్న కుమార్‌పై కక్ష పెంచుకుని పలు సందర్భాల్లో ఇబ్బందులకు గురిచేశారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో టీడీపీ అధికార బలంతో, ఆ నిధులు డ్రా చేసేందుకు సర్పంచ్ ప్రసన్నపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ప్రసన్నకుమార్ కోర్టు తీర్పు, ఉన్నతాధికారులు సూచనల మేరకు బిల్లులు డ్రా చేస్తామని, లేని పక్షంలో నిధులు డ్రా చేసేందుకు వీలులేదని గట్టిగా చెప్పారు. ఎలాగైనా బిల్లులు డ్రా చేయాలని సిద్ధమైన కోటేశ్వరరావు గురువారం వెంకటగిరి ఎంపీడీఓ కోటేశ్వరరావు, టీడీపీ నేతల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఈ సందర్భంగా మాటా మాటా పెరిగి మేట్ కోటేశ్వరరావు సర్పంచ్ చెంచుప్రసన్నపై దాడి చేశారు. ఈ వ్యవహారంపై సర్పంచ్ చెంచుప్రసన్నకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనకు జరిగిన అన్యాయం గురించి ఆవేదన వ్యక్తం చేశారు.

యువత శాస్త్రవేత్తలు కావాలి


విద్యార్థికి జ్ఞాపిక అందజేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భవిష్యత్‌లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ బలీయమైన సంస్థగా రూపొందాలంటే నేటి యువత శాస్త్రవేత్తలు కావాల్సిన అవసరం ఉందని చెన్నై నాయిట్ కేంద్రం డైరెక్టర్ బాలాజీ రామకృష్ణ సూచించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన గురువారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి నాయిట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువతరం అంతా ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతోపాటు రూ.లక్షల వేతనం వైపు చూస్తున్నారని, కాని ఇస్రోలో చేరితే ఉద్యోగంతోపాటు దేశానికి సేవలు అందించిన శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందుతారనే విషయాన్ని మరచిపోకూడదని విద్యార్థులకు సూచించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ 1999 నుంచి అంతరిక్ష వారోత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని, ఈసారి నిర్వహించిన కార్యక్రమాల్లో 2,700 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాబోయే రోజుల్లో గగన్‌యాన్–1 ప్రాజెక్ట్, చంద్రయాన్–4, వీనస్ (శుక్రయాన్) లాంటి అత్యంత భారీ ప్రాజెక్ట్‌లను చేపట్టి ఇస్రో ప్రతిభను చాటుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, డిప్యూటీ డైరెక్టర్లు ఆర్ సెంథిల్‌కుమార్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


దెబ్బతిన్న మినీవ్యాన్(ఇన్‌సెట్) చక్రవర్తి మృతదేహం


పెళ్లకూరు: తిరుపతి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం వద్ద గురువారం మినీవ్యాన్‌ను లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ కోటా చక్రవర్తి(55) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి ప్లైవుడ్ లోడ్‌తో తిరుపతికి వెళుతున్న మినీవ్యాన్‌ను బెంగళూరు నుంచి కృష్ణపట్నం వెళుతున్న లారీ చిల్లకూరు వడ్డిపాళెం వద్ద ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన మినీవ్యాన్ డ్రైవర్ కోటా చక్రవర్తి తీవ్రంగా గాయపడి, నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాక్టర్ బోల్తా పడి మరొకరు..


బోల్తాపడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్)శేఖర్(ఫైల్)

శ్రీకాళహస్తి: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం కొన్నలి వద్ద చోటు చేసుకుంది. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పునబాకకు చెందిన నలుగూరు శేఖర్(33)కు సొంత ట్రాక్టర్ ఉంది. వ్యవసాయ పనుల నిమిత్తం అత్తగారి ఊరైన తొట్టంబేడు మండలం కొన్నలి గ్రామానికి వెళ్లాడు. వరి విత్తనాలు కొనుగోలు చేసేందుకు ట్రాక్టర్‌తో శ్రీకాళహస్తికి వెళుతుండగా కొన్నలి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మత రాజకీయం.. క్షమించరాని నేరం


మాట్లాడుతున్న రాయపునేని హరికృష్ణ

తిరుపతి కల్చరల్: మతాలతో రాజకీయాలను నడపడం క్షమించరాని నేరమని తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ తెలిపారు. అయితే ఇందుకు భిన్నమైన ఆలోచనలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలను ఏవైపు నడుపుతున్నారో? ఆలోచించాలన్నారు. తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యూత్‌హాస్టల్లో 'సనాతన ధర్మం –రాజకీయాలు' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ సమాజంలో ఉద్రిక్తత సృష్టించేలా మాట్లాడారని, ఇది సరికాదన్నారు. సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ బీజేపీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తరిమిల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం నేత పి.వెంకటరత్నం మాట్లాడుతూ సనాతన ధర్మం నేటి ఆధునిక యుగాన్ని మధ్యయుగాల వైపు నడిపిస్తోందని, ఇది ఏ మాత్రం సరికాదన్నారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం నేత తులసేంద్ర మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయన్నారు. ప్రజా వేదిక ప్రధాన కార్యదర్శి కె.కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల దారి అజ్ఞానం, అంధకారం వైపేనని, మార్పు సహజమన్నారు. శ్రీవిద్యాహంస భారతి అనుచరుడు ఆల్‌మెన్‌రాజు సూద్ర మాట్లాడుతూ ధర్మం ఒక్కటే శాశ్వతమైందని తెలిపారు. యూటీఎఫ్ నేత నిర్మల మాట్లాడుతూ మనుధర్మాన్ని ఆమోదించడమంటే నేటి ఆధునిక మహిళల ప్రాణాలను బలి తీసుకోవడమే అన్నారు. టీచర్ చంద్రశేఖర్, రామిశెట్టి వెంకయ్య, జయరామయ్య, ఉష, ఆశా యూనియన్ నేత రాణి, మునికుమార్, ధనశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ రాష్ట్ర జట్టు మేనేజర్‌గా నాగరాజు


జట్టు మేనేజర్ నాగరాజు


ప్లేయర్‌గా టి నరేష్

తిరుపతి సిటీ: డీసీసీఐ, నారాయణ సేవా సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరిగనున్న దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు రాష్ట్ర జట్టు మేనేజర్‌గా తిరుపతికి చెందిన బి నాగరాజు ఎంపికైనట్లు డీఏసీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. అలాగే వెదురుకుప్పం మండలానికి చెందిన టి నరేష్ జట్టులో ప్లేయర్ ఎంపికకాగా, స్టాండ్ బై ప్లేయర్‌గా పలమనేరుకు చెందిన టి గుణశేఖర్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. దేశ చరిత్రలోనే మొదటి సారిగా దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ప్రయాణ సౌకర్యాలు, కిట్లు అందజేసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కే చిన్ని, కార్యదర్శి సతీష్ బాబుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇద్దరికి యావజ్జీవ శిక్ష


శ్రీకాళహస్తి కోర్టు వద్ద ముద్దాయిలతో పోలీసులు

ఏర్పేడు: భూతగాదాతో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష విధిస్తూ గురువారం శ్రీకాళహస్తి ఏడీజే కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస నాయక్ తీర్పు చెప్పినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. 2019 ఫిబ్రవరి 18న మండలంలోని మన్రిమంద గ్రామానికి చెందిన పులుసు మునస్వామి(45)ను సమీపంలోని బాపూజీ విద్యా సంస్థల వద్ద అదే గ్రామానికి చెందిన తంబి కుమారస్వామి, తంబి నేపాల్ హత్య చేశారన్నారు. అప్పట్లో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం వారిపై చార్జిషీట్ ఫైల్ చేయగా నిందితులపై కేసు రుజువుకావడంతో గురువారం శ్రీకాళహస్తి ఏడీజే కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస నాయక్ నిందితులకు జీవిత కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. పోలీసులు, దర్యాప్తు అధికారిని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు అభినందించినట్లు సీఐ చెప్పారు.

యూట్యూబర్‌కు జైలు

ఏర్పేడు: వెల్డన్ రాక్స్ యూట్యూబ్ సృష్టికర్త కొంగర రామిరెడ్డికి జైలు శిక్ష విధించినట్లు రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ గురువారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు.. 2019లో వెల్డన్ రాక్స్ అనే పేరుతో యూట్యూబ్ ఛానెల్‌ను సృష్టించి అందులో ఏర్పేడు, రాచగున్నేరి మధ్య రైల్వే ట్రాక్‌లపై గ్యాస్ సిలెండర్లు, బైక్‌లు, బొమ్మలు, పండ్లు, క్రాకర్స్, చేపలు, చికెన్, గుడ్లు తదితర వస్తువులను రైళ్లు ఢీకొన్నట్లు వీడియోలు అప్‌లోడ్ చేశారు. అవి కంటెంట్ ట్రెండ్‌గా మారాయి. అప్పటి రేణిగుంట ఆర్‌పీఎఫ్ సీఐ హీరాసింగ్ ఈ వీడియోలపై స్పందించి, రామిరెడ్డిపై కేసు నమోదు చేశారు. ప్రజల భద్రత, ఆస్తికి హాని కలిగించినందుకు రైల్వే చట్టంలోని సెక్షన్ 147, 153 కింద నిందితునిపై అభియోగాలు మోపారు. అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం నెల్లూరులోని స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినోద్ ముందుకు ఈ కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.